# ఎల్లంపల్లిలో.. దొంగలు పడ్డారు!

మొదటిపేజీ తరువాయి...

పోసి, దాదాపు 40 చెరువులు నిర్మించారు. ప్రాజెక్టు నుంచి పైప్‌లైన్లు వేసి చెరువుల్లోకి నీటిని పంప్ చేస్తున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం నిల్వకొలతలను ప్రభావితం చేసేస్థాయిలో ఈ వ్యవహారం సాగుతున్నది. అవసరమైన కరెంటును కూడా ట్రాన్స్‌కో విద్యుత్ స్తంభాల ద్వారా అక్రమ కనెక్షన్లతో వాడుకుంటున్నారు. ప్రాజెక్టు నీళ్లలోనే త్రీఫేస్ కరెంటు వైర్లను వేసి, ప్రమాదకర పరిస్థితుల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. అయినా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడంలేదు. కాంగ్రెస్ నేతలకు మామూళ్లు అందనప్పుడు అధికారులు హడావుడి చేస్తున్నారని, చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



చేపల చెరువుల్లో వేసిన చికెన్ వ్యర్థాలు

### బహుళ ప్రయోజనాలకు విఘాతం

అత్యంత కీలకమైన ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 20.17టీఎంసీలు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎన్టీపీసీకి 6 టీఎంసీలు, హైదరాబాద్ తాగునీటి అవసరాలు, మంథని, ఆర్‌ఎఫ్‌సీఎల్, మంథని నియోజకవర్గంలోని టెయిలెండ్ ప్రాంతాలకు సాగునీటి కోసం 2టీఎంసీలను తరలిస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో ఎల్లంపల్లిని కేంద్రంగా చేసుకొని కాళేశ్వరం ప్రాజెక్టు లింక్–1 నుంచి లింక్–2కు నీటిని అందించేలా నంది పంప్‌హౌస్ నిర్మించారు. రాష్ట్ర సాగునీటి అవసరాల కోసం ప్రధాన వనరుగా తీర్చిదిద్దారు. కానీ ఇప్పుడు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ఏరియాను కొందరు అక్రమార్కులు కబ్జాచేసి.. అక్రమదందాకు తెరతీశారు.

### మాఫియా దందా.. రాజకీయ అండ!

ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ ఏరియాలో పది మంది అక్రమార్కులు ముఠాగా ఏర్పడి చేపల చెరువుల మాఫియాగా ఏర్పడ్డారని తెలుస్తున్నది. ముగ్గురు రైతులకు సంబంధించిన దాదాపు 10ఎకరాలను లీజుకు తీసుకొని, పక్కనే ఉన్న ప్రాజెక్టు భూముల్లో 30–40చెరువులు నిర్మించారు. రామగుండం నుంచి పొట్యాలకు వెళ్లే ప్రధాన రహదారికి కిలోమీటరు దూరంలో, ముర్మూర్ శ్రీపాద పంప్‌హౌస్ వెనుక, ముందు చేపల చెరువులు ఏర్పాటుచేశారు. రవాణాకు అనుకూలంగా లారీలు, వ్యాన్లు తిరిగేలా రోడ్లను ఏర్పాటు చేసుకున్నారు.

### నీటినిల్వలకు ఆటంకం

ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వకు అక్రమ చెరువులు ఆటంకం కలిగిస్తున్నాయి. వర్షాకాలం ప్రాజెక్టు నిండుగా ఉన్నప్పుడు బ్యాక్‌వాటర్ చేపల చెరువుల్లోకి రాకుండా కట్టలు వేశారు. ప్రాజెక్టులో నీళ్లు దూరం వెళ్తే ప్రాజెక్టులోనే సరాసరిగా పంపులు వేసి చేపల చెరువుల్లోకి నీరు నింపుతున్నారు. ప్రాజెక్టులో 16టీఎంసీల నీరు ఉంటే చేపల చెరువుల వరకు నీటి ఒత్తిడి ఉంటుంది. దీంతో చెరువులకు నీళ్లు నింపుకోవడం నిర్వాహకులకు సులభమవుతున్నది. 16టీఎంసీల కంటే నీటి నిల్వ తగ్గితే ప్రాజెక్టు లోపలి వరకు వేసిన పైప్‌లైన్ల ద్వారా నీళ్లు పంప్ చేసుకుంటున్నారు. వేసవిలో ప్రాజెక్టు నీటి సామర్థ్యం తక్కువగా ఉంటుంది కనుక రెండో, మూడో పంటకు నీటి ఎద్దడి ఏర్పడకుండా అర కిలోమీటర్ వరకు ప్రాజెక్టు లోపలికి పైప్‌లైన్లు వేశారు. చేపల చెరువు పక్కనే ముర్మూర్ భారీ పంపుహౌస్ ఉన్నది. రామగుండంలోనే శ్రీపాద ప్రాజెక్టు ఇరిగేషన్ విభాగం డివిజనల్ ఇంజినీర్ కార్యాలయం ఉంది. అయినా అక్రమాలను ఎవరూ అడ్డుకోవడంలేదు.

#### మాకు అన్యాయం జరుగుతున్నది



కొందరు అక్రమార్కులు రైతుల భూములను లీజుకు తీసుకొని, పక్కనే ఉన్న ఎల్లంపల్లి భూములను కబ్జా చేశారు. ఆక్రమణలలో చేపల చెరువులను నిర్మించారు. మాకు సరఫరా అవ్వాల్సిన వ్యవసాయ విద్యుత్తునే దొంగతనంగా చేపల చెరువులకు వాడుతున్నారు. దీంతో మాకు విద్యుత్‌లో ఓల్టేజ్ సమస్య ఎదురవుతున్నది. నిత్యం నీటిని పంపింగ్ చేస్తున్నారు. కోతల సమయంలో ఇబ్బంది పడుతున్నాం.

– ఆకునూరి రవీందర్, సోమనపల్లి, అంతర్గాం మండలం

#### సర్వే చేసి, నోటీసులు ఇచ్చాం

ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ ఏరియాలో వందలాది ఎకరాల్లో భూములను కబ్జా చేసి అక్రమంగా చేపల చెరువులను నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్‌లోనే ఈ చేపల చెరువులు ఉన్నాయని తేలింది. చెరువులను తొలగించాలని అక్రమార్కులకు నోటీసులు ఇచ్చాం. అంతర్గాం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, వారు కబ్జాలను తొలగించలేదు.

స్వామి, ఎల్లంపల్లి ఈఈ. బుచ్చిబాబు, డీఈఈ

### రైతుల అవసరం.. అక్రమాలకు ఆసరా

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కోసం సేకరించిన భూముల పక్కనే పట్టా భూమి కలిగిన రైతులు రూ.20వేలకు ఎకరం చొప్పున చేపల చెరువులకు లీజుకు ఇస్తున్నారు. రూ.10వేలు కౌలురాని పరిస్థితుల్లో ఎకరాకు రూ.20వేలు పొందుతుండడంతో చెరువుల కోసం లీజుకు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. వీరి వద్ద తీసుకునే ఒకటిరెండు ఎకరాలతో వందల ఎకరాలను కబ్జా చేస్తూ రెచ్చిపోతున్నారు. మిగిలిన 90శాతం చేపల చెరువులను ప్రాజెక్టు భూముల్లోనే ఏర్పాటు చేశారు. ఈ వ్యవహారంలో ఓ కాంగ్రెస్ నేత అండదండలు ఉన్నట్టు ఆరోపణలు వినవస్తున్నాయి.

## కిస్తీలు కట్టలేక ఆటో డ్రైవర్ ఆత్మహత్య

- ఫ్రీ బస్ పథకంతో ఆటోలకు తగ్గిన గిరాకీ
- కామారెడ్డి జిల్లా గర్గుల్ గ్రామంలో విషాదం



నర్సింహులు (ఫైల్)

కామారెడ్డి రూరల్ , జూన్ 1: ఫైనాన్స్ కిస్తీలు, చేసిన అప్పులు తీరకపోవడంతో పాటు మహిళలకు ఉచిత బస్సుతో ఆటో నడవక మరిన్ని అప్పులు కావడంతో ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్నది. కుటుంబీకుల కథనం మేరకు వివరాలు .. కామారెడ్డి మండలం గర్గుల్‌కు చెందిన గుంటికాడి నర్సింహులు(45) ఆటో నడుపుతూ జీవనం కొనసాగించేవాడు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహిళలకు ఫ్రీ బస్సు'పథకంతో ఆటో గిరాకీ దెబ్బతిన్నది. దీంతో కుటుంబపోషణకు అప్పుల పాలయ్యాడు. ఆటో నడవకపోవడంతో ఫైనాన్స్ కిస్తీలు కట్టడానికి డబ్బులు లేక మరిన్ని అప్పులు మీదపడ్డాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన నర్సింహులు ఆదివారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య వినోద, ఇద్దరు కొడుకులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆటో యూనియన్ నాయకులు కోరారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాజు తెలిపారు.

## ప్రభుత్వంపై వ్యతిరేకత నిజం!

- ముఖ్యమంత్రితో సమావేశంలో మంత్రుల మాట
- 5న క్యాబినెట్ భేటీ నిర్వహించాని నిర్ణయం

హైదరాబాద్, జూన్1 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ, రైతు భరోసాకు ఆశించిన మైలేజీ రాలేదని ముఖ్యమంత్రి, మంత్రులు అంతర్మథనం చెందుతున్నట్టు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నదని పలువురు మంత్రులు అభిప్రాయపడ్డట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పార్టీ రాష్ట్రవ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప్రత్యేకంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ముఖ్య నేతలతో సమావేశం కావడం, ప్రభుత్వం, మంత్రుల పనితీరుపై వివరాలు సేకరిస్తుండటంపై చర్చించినట్టు తెలిసింది. పలువురు మంత్రుల వ్యక్తిగత వ్యవహారాలు, వాటి పర్యవసానాలపైనా వాడివేడిగా చర్చ సాగినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. కొందరు మంత్రుల పనితీరు బాగాలేదని, మెరుగుపడాల్సిందేనని సీఎం స్పష్టం చేసినట్టు సమాచారం. అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని హెచ్చరించినట్టు తెలిసింది. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడంలో చాలా వెనుబడ్డామని, అందరూ సమాన బాధ్యత తీసుకోవాలని మంత్రులకు సూచించినట్టు చెప్పుకుంటున్నారు. ఈ నెల 5వ తేదీన క్యాబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 4న ఢిల్లీకి వెళ్లనున్నట్టు తెలిసింది.



టీజీపీఏ ద్వితీయ వార్షికోత్సవంలో ప్రిన్సిపాల్స్

## కామన్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయండి

- నైట్ డ్యూటీల నుంచి టీచర్లను మినహాయించాలి
- తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ డిమాండ్

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని గురుకుల సొసైటీల నిర్వహణ కోసం కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రౌతు అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. నైట్‌డ్యూటీల నుంచి గురుకుల టీచర్లను మినహాయించాలని, వార్డెన్లను నియమించాలని కోరారు. తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవాన్ని హైదరాబాద్ టీఎన్‌జీవోస్ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని గురుకులాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని, డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని, కామన్ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యోగుల జేఏసీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ విజినరీ గురుకుల అల్యూమినీ జాయింట్ సెక్రటరీ వివేకానంద మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధించడం మంచి పరిణామని పేర్కొన్నారు. అనంతరం వివిధ సొసైటీల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రిన్సిపాల్స్‌కు మెమెంటోలు అందజేసి సత్కరించారు.

## 13 లేదా 14న ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు ఈ నెల 13 లేదా 14న విడుదలకానున్నాయి. ఈ రెండు తేదీల్లో ఏదో ఒక రోజు ఫలితాలు విడుదల చేయాలని ఇంటర్‌బోర్డు భావిస్తున్నది. పరీక్షల మూల్యాంకనం ఈ నెల 6తో పూర్తికానున్నది. తర్వాత ప్రాక్టికల్స్, సహా ఇంటర్నల్స్ పరీక్షలను పూర్తిచేసి 13, 14 తేదీల్లో ఫలితాలు విడుదల చేయాలన్న ఆలోచనలో అధికారులున్నారు.

## నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల విడుదల

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు సోమవారం విడుదలకానున్నాయి. ఐఐటీ కాన్పూర్ ఉదయం 10 గంటలకు జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకులను విడుదల చేయనున్నది. విద్యార్థులు ఫలితాల కోసం jeeadv.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు. తర్వాత ఐఐటీలు, ఎన్ఐటీల్లో సీట్ల భర్తీకి నిర్వహించే జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ ఈనెల 3 నుంచి ప్రారంభంకానున్నది. అదే రోజు నుంచి ఆప్షన్లు ఎంచుకోవచ్చు. 14న మొదటి రౌండ్, 21న రెండు, 28న మూడు, జూలై 4న నాలుగు, జూలై 10న ఐదోరౌండ్ సీట్లు కేటాయిస్తారు. జూలై 16న ఫైనల్ రౌండ్ సీట్లు కేటాయిస్తారు.














